ముమ్మరంగా వరి ఉబాలు

- 15 వేల ఎకరాల విస్తీర్ణంలో సాగు
- 2500 ఎకరాల్లో వెద సాగు

సీతానగరం:

రెండు రోజుల పాటు కురిసిన వర్షాల కారణంగా వరివెదల మడులలో కలుపుతీయడంతో పాటు వరినాట్లు వేయడానికి సిద్ధంగా ఉన్న మడులలో దమ్ములు చేసి ఉబాలు చేయడానికి రైతులు ఉపక్రమించారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని 17,500 ఎకరాల్లోవరి సాగుకు రైతులు విత్తనాలు కొనుగోలు చేశారు. ఈ క్రమంలో 15 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి ఉబాలకు రైతులు నిర్ణయించి వరి నారు తయారుచేశారు. వరినారు ఏపుగా పెరగడం వల్ల దమ్ము పనులు పూర్తి చేసుకుని వరినాట్లు (ఉబాలు) వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. అలాగే మండలంలో 15 రోజుల క్రితం కురిసిన వర్షాలకు మట్టి నమూనాలు చేసిన వర్షాధారంపై ఆధారపడిన 2,500 ఎకరాల విస్తీర్ణంలో వరి వెదలు వేశారు. పెదంకలాం, సుమిత్రాపురం, కృష్ణారాయపురం, వెంకటాపురం, నిడగల్లు గాదెలవలస, జానుమల్లువలస, పీబీ పేట గ్రామాల్లో వరివెద భూముల్లో వరి మొక్కలు ఏపుగా పెరగడంవల్ల రైతులు కలుపు నివారణకు పనులు ఆరంబించారు. శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి మడులలో నీరు చేరడంతో పాటు నీటి వనరులున్న, వరినారు వేయడానికి అనుకూలంగా వాతావరణం ఉన్నందున ఉబాలు చేయడంలో రైతులు నిమగ్నమయ్యారు. ఉబాలు చేసిన మడులలోను, వరివెదలు వేసిన పొలాల్లో ఎరువులు వేయాల్సిన సమయం వచ్చింది. అలాగే చెరకు పంట తోటలలో వేయడానికి ఎరువుల అవసరం ఉంది. ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యగా ఎరువులు సమకూర్చవలసిన సమయం ఆసన్నమైనప్పటికీ అరకొరగా ఎరువులు నిల్వలున్నా యని రైతులు ఆరోపిస్తున్నారు. ఉబాలు చేయడం, వరివెదల మొక్కలు పెరుగుతున్న కారణంగా రైతులు ఎరువుల కోసం ఎదురుచూస్తున్నారు.



లక్ష్మీపురంలో వరినాట్లు వేస్తున్న మహిళా రైతులు



తాడు ఆధారంగా వరి నాట్లు వేస్తున్న రైతు కూలీలు

రైతులకు ఎరువులు అందిస్తాం



వర్షాలు అనుకూలంగా కురిసిన మేరకు మండలంలో వరి నాట్లు వేయడానికి రైతులు సిద్ధమై దమ్ము పనులు ఆరంభించారు. 2024–25 ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు చేస్తున్న రైతులకు పంటల అవసరాలకు అనుగుణంగా ఎరువులు సమకూర్చడానికి సిద్ధం చేస్తున్నాం.

–ఎస్.అవినాష్, ఏఓ సీతానగరం

ఎరువులు అందుబాటులో ఉంచాలి



మండలంలో 2024–25 ఖరీఫ్ సీజన్‌ల్లో రైతులు పండించే వరిపంటకు అవసరమైన ఎరువులు, క్రిమి సంహారక మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలి. ఎరువుల విక్రయాలపై అధికారులు దృష్టి సారించాలి. వరిపంటలో వచ్చే తెగులు, ఇత వ్యాధులను ఎప్పటికప్పుడు పరిశీలించి రైతాంగానికి పలు సూచనలు సలహాలు ఇవ్వాలి. పంటల బీమా పథకం అమలు చేసి రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి.

–ఆర్.ఈశ్వరరావు, రైతు సంఘం డివిజన్ నాయకుడు

సైబర్ మోసాల పట్ల జాగ్రత్త

- పట్టణ ఎస్సై రవీంద్ర రాజు



పార్వతీపురం టౌన్: సైబర్ మోసాల పట్ల తీసుకో వాల్సిన జాగ్రత్తలపై అప్రమత్తం అవసరమని పార్వతీపురం పట్టణ ఎస్సై బి.రవీంద్ర రాజు అన్నారు. ఓటీపీ మోసాల నుంచి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంపై ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల గురించి గతంలో వీడియో నిర్వహించామని అది అందరికీ బాగా చేరువైందని నమ్ముతున్నానన్నారు. సాధారణంగా సైబర్ నేరాల్లో రెండు రకాలు ఉంటాయని ఒకటి ఫైనాన్షియల్ రెండవది నాన్ ఫైనాన్షియల్ అని చెప్పారు. ఫైనాన్షియల్లో డబ్బులు కోల్పోతామని, నాన్ ఫైనాన్షియల్ అంటే ఫిజికల్ వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌పై జరిగే విషయాలని చెప్పారు. ఫైనాన్షియల్ ఫ్రాడ్‌లో ఓటీపీ ఫ్రాడ్ గురించి వివరిస్తూ ఓటీపీ(వన్ టైం పాస్‌వర్డ్) సాధారణంగా బ్యాంకు నుంచి మనం డబ్బులు తీస్తామని కానీ ఆన్‌లైన్‌లో బ్యాంకు లావాదేవీలు జరుపుతున్నామని ప్రతిసారి మనం బ్యాంకుకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లో లావాదేవీలు జరిపేటప్పుడు మన ఫోన్‌కు ఓటీపీ నంబర్ వస్తుందని అది బ్యాంకు సెక్యూరిటీ ఫీచర్ అన్నారు. ఈ ఫీచర్ వల్ల మన డబ్బుకు సెక్యూరిటీ ఉంటుందని, ఆ ఓటీపీ నంబర్ మీరు తెలిపితేనే డబ్బులు పంపుతారని, ఆ ఓటీపీ నంబరును సైబర్ నేరస్తులు క్యాచ్ చేయడం గానీ, మన మొబైల్‌ను హ్యాక్ చేయడానికి ట్రై చేస్తారని, అందుకు ప్రజలు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ఎక్కువగా ఉన్నాయని ఎక్కువగా అందరికీ డబ్బులు డైరెక్ట్‌గా బ్యాంక్ అకౌంట్‌లో పడుతున్నాయని, కావున మేము వెల్ఫేర్ స్కీమ్ నుంచి మాట్లాడుతున్నాం. ఏమైనా సంక్షేమ పథకాలకు మీరు అర్హులో కాదో చూడాలి లేదా ఇంకేమైనా పథకానికి అర్హత ఉందో లేదో చూడాలి. మేము తెలుసుకుని చూసి చెబుతాము మీ వివరాలు చెప్పండని అడిగిన సందర్భంలో ఎలాంటి ఓటీపీ చెప్పరాదని, అందుబాటులో గ్రామ సచివాలయం, బ్యాంకులు, పోలీస్‌స్టేషన్ ఉన్నాయి కాబట్టి మీరు ఎప్పుడు కూడా ఓటీపీ చెప్పకూడదని చెబితే నష్టపోతారని హితవు పలికారు. లేని పక్షంలో తెలిసిన వారిని సంప్రదించాలని సూచించారు.

పత్తిచేనులో కలుపుతీత

భామిని: మండలంలో ప్రధాన మెట్టు పంటగా సాగు చేస్తున్న పత్తి చేనులో గొప్పులు, కలుపుతీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అడపాతడపా కురుస్తున్న వానలకు పత్తి విత్తనాలు మొలకెత్తి మొక్కలుగా మారాయి. ఈ దశలో కలుపు నివారణపై రైతులు దృష్టి పెట్టారు. ఒకవైపు ఖరీఫ్ వరి దమ్ములు, ఉభాలు.. మరోవైపు పత్తిసాగులో గొప్పులు, కలుపుతీత పనుల నేపథ్యంలో రైతు కూలీలకు డిమాండ్ పెరిగింది.



బిల్లుమడ వద్ద పత్తిచేనులో కలుపు తీస్తున్న కూలీలు

నదులపై కొత్త బ్రిడ్జిలు నిర్మించాలి

పార్వతీపురం టౌన్: సీతానగరం, కోటిపాం గ్రామాల వద్ద ఉన్న నదులపై కొత్త రవాణా బ్రిడ్జిలు నిర్మించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆ బ్రిడ్జిలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో సీతానగరం, కోటిపాం గ్రామాల వద్ద నదులపై ఉన్న రవాణా బ్రిడ్జిలు పురాతనమైనవని, ఈ బ్రిడ్జిలు బ్రిటిష్ వారి హయాంలో నిర్మించినవని, ఎక్కువ కాలం మన్నికలో ఉండడం వల్ల బలహీన పడే ఆస్కారం ఉందన్నారు. విశాఖపట్నం విజయనగరం నుంచి ఈ బ్రిడ్జిల మీదుగా ఒడిశా, మధ్యప్రదేశ్ పోయే ప్రధానమైన రహదారి కావడం, నిరంతర ఎక్కువగా వాహనాల రద్దీ ఉండడం, కాలం చెల్లిన బ్రిడ్జిలు ఇంకా వాడుకలో ఉండడం శ్రేయస్కరం కాదని అభిప్రాయ పడ్డారు. ఈ ప్రాంత శాసనసభ్యులు, జిల్లా ఉన్నతాధికారులు చొరవ చేసి ఈ రెండు గ్రామాల వద్ద నదులపై పాత బ్రిడ్జిల ప్రక్కన కొత్త రవాణా బ్రిడ్జిలను నిర్మించి ప్రజా రవాణాకు ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. కొత్త బ్రిడ్జిలు నిర్మించే వరకూ సీపీఐ ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.



సమస్యలు తెలియజేస్తున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న

తల్లికి వందనంపై ఎమ్మెల్యేలను నిలదీయండి..

- మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా చదువుతున్న పిల్లలందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని, ఈ విషయంలో తల్లిదండ్రులు ఎమ్మెల్యేలను నిలదీయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలోని తన స్వగృహంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీఓలో విద్యార్థి తల్లికి రూ. 15000 అందజేస్తామని పొందుపరిచారన్నారు. దీంతో పిల్లలందరికీ పథకం వర్తింపజేయాలని కోరుతూ తల్లిదండ్రులు ఆందోళనలు చేశారన్నారు. ఈ మేరకు సాక్షిలో కథనాలు, వార్తలు ప్రచురితమైతే మంత్రి రామానాయుడు ప్రెస్‌కౌన్సిల్‌లో సాక్షిపై ఫిర్యాదు చేయడం తగదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఒక్కో కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అందరికీ పథకం వర్తింపజేస్తామన్నారని.. అలాగే ప్రచారంలో కూడా కూటమి నాయకులు ఊదరగొట్టారన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత విడుదల చేసిన జీఓలో ఒక్కో తల్లికి రూ. 15000 అందిస్తామని చెప్పడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు జీఓ విడుదల చేశారో, లేదో మంత్రి లోకేష్ చెప్పాలని డిమాండ్ చేశారు. నాడు కుటుంబంలో ఒక విద్యార్థికి జగన్ మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకం వర్తింపజేస్తే... మిగిలిన విద్యార్థులు గేదెలు కాసుకోవాలా అంటూ అప్పటి టీడీపీ నాయకురాలు, ప్రస్తుత హోమ్‌మంత్రి అనిత ఆరోపించారన్నారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలో ఉందని, అందరి విద్యార్థులకు ఎందుకు తల్లికి వందనం అమలు చేయరని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో సీపీఎస్‌కు బదులు జీపీఎస్‌ను తీసుకువచ్చామని, ఆ కోపంతోనే ఉద్యోగులందరూ పార్టీకి దూరమయ్యారని తెలిపారు. అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జీపీఎస్‌ను రద్దు చేసి సీపీఎస్‌ను ఎందుకు అమలు చేయరన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిపై బురదజల్లే ప్రయత్నాలు మానుకుని, ప్రజలకు మేలు చేసేలా పాలన సాగించాలని హితవు పలికారు. సమావేశంలో కౌన్సిలర్లు, నాయకులు గిరి రఘు, సింగారపు ఈశ్వరరావు, తాడ్డి శంకరరావు, తాడ్డి యశోదకృష్ణ, పిరిడి రామకృష్ణ, అబ్దుల్, సురేష్, కన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

గ్రామాల్లో దేశమ్మ తల్లి వారాల పండగ



కృష్ణారాయపురంలో దేశతల్లి మొక్కులు తీర్చడానికి మేళతాళాలతో వెళ్తున్న భక్తులు

సీతానగరం: మండలంలో వరి ఉబాల ప్రారంభానికి ముందుగా అమ్మవార్ల ఆశీస్సులు పొందడానికి ఏటా నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పలు గ్రామాల్లో వారాల పండగ జరిగింది. కృష్ణారాయపురం, సుమిత్రాపురం, బూర్జ, లక్ష్మీపురం, కామందొరవలస, ఏగోటివలస, రంగంపేట, దయానిధిపురం, జయంతిరాయపురం తదితర గ్రామాల పుర వీధుల్లో అమ్మవారి పూనకంతో ఉన్న వారితో పాటు అమ్మవారి పూజా సామగ్రితో వస్త్రాలు, పిండివంటలు, పప్పు బెల్లాలుతో భక్తులు బాజాభజంత్రీలు మేళతాళాలతో గ్రామ శివారుల్లో ఉన్న వనం గుడివరకూ పాదయాత్రగా వెళ్లి మొక్కలు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో జెడ్పీటీసీ ఎం. బాబ్జీ, ఆయాగ్రామాల సర్పంచ్‌లు బి శ్రీనివాసరావు, బొత్స నందిని, జి.అన్నంనాయుడు, జి దాసు,టి సత్యవతి, ఉరిటి రాధాకృష్ణ, టి.రామారావు, మాజీ సర్పంచ్ రాధాకృష్ణ, ఎంపీటీసీలు జి.పార్వతి, జి .చిన్నంనాయుడు, వై వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు సహారా బాధితుల ధర్నా..

గరుగుబిల్లి: సహారా ఖాతాదారుల డిపాజిట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం 10 గంటలకు ఖాతాదారులతో కలిసి ర్యాలీ నిర్వహించనున్నట్లు సహారా ఏజెంట్లు జి.సర్వేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, ఎంఎన్ నాయుడు, తదితరులు ఆదివారం తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు చెప్పారు. 2012 నుంచి చెల్లింపులు చేయకుండా నేడు, రేపు అంటూ కాలయాపన చేస్తున్నారని, ఈ కారణంగా అటు ఖాతాదారులు, ఇటు ఏజెంట్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ప్రభుత్వం వెంటనే ఖాతాదారలకు చెల్లింపులు చేసి బాధితులను ఆదుకోవాలని కోరారు. సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ధర్నాలో సహారా బాధితులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

పాలకొండ రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమైన కాంపిటీటీవ్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, నిరుద్యోగ యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి బి.గణేష్‌బాబు అన్నారు. 'చదవటం మాకిష్టం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ.. టెట్, డీఎస్సీతో పాటు గ్రూప్స్ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉందన్నారు. ప్రభుత్వ కొలువులు సాధించిన వారు వారి వద్ద ఉన్న పోటీ పరీక్షలకు సంబంధిన స్టడీ మెటీరియల్ వృథా చేయకుండా గ్రంథాలయానికి అందిస్తే నిరుద్యోగ యువతకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.



గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విశ్రాత ఉద్యోగులు, యువత

పశుగ్రాసంతో పాల దిగుబడి

గరుగుబిల్లి:

పాడిపశువులు అధిక దిగుబడి ఇచ్చేందుకు మేలుజాతి పశుగ్రాసం ఎంతో అవసరమని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎస్.మన్మథరావు అన్నారు. పశుగ్రాస వారోత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని చిలకాంలోని పశుగ్రాస క్షేత్రాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోషక విలువలున్న పశుగ్రాసాన్ని పాడిపశువులకు అందించడం ద్వారా పశువులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు మంచి పాలదిగుబడి ఇస్తాయన్నారు. పశుగ్రాసం సాగుకు పశుసంవర్ధక శాఖ ద్వారా ప్రభుత్వం అందించే ప్రోత్సాహాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా.ఎస్.సురేష్‌కుమార్, సిబ్బంది శ్రీరాములునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించితే ముప్పే..

- భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువుల వినియోగం మేలు
- అధిక మోతాదులో వేస్తే పంట దిగుబడిపై ప్రభావం
- సమతుల్యత పాటించాలంటున్న వ్యవసాయశాఖ సిబ్బంది



వరినాట్లు వేస్తున్న రైతులు

గరుగుబిల్లి: కొద్దిరోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ వరినాట్లు జోరందుకున్నాయి. వరినాట్లు వేసే పనిలో రైతులు, రైతు కూలీలు బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎరువుల వినియోగం, సాగు యాజమాన్య పద్ధతులపై వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు పలు సూచనలు చేస్తున్నారు. భూసార పరీక్ష ఫలితాలకు అనుగుణంగా ఎరువులు వేసుకోవడం వల్ల సాగు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు పొందవచ్చని అంటున్నారు. ఎరువుల మోతాదు మించితే భూమి నిస్సారంగా మారడంతో పాటు దిగుబడులపై ప్రభావం చూపుతుందని అంటున్నారు. నత్రజని, పొటాష్, భాస్వరం, జింక్ సల్ఫేట్ తదితర ఎరువులను ఎప్పుడు వేసుకోవాలి, ఎంత మోతాదులో వేసుకోవాలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. కురుపాం నియోజకవర్గంలో గరుగుబిల్లి, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లో సుమారు 82 వేల ఎకరాల పంట భూములు ఉండగా.. అందులో 62,400 ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగు చేసేందుకు రైతులు సమాయత్తమయ్యారు.

నత్రజని: నత్రజనిని కాంప్లెక్స్ ఎరువుల రూపంలో లేదా యూరియా రూపంలో లభిస్తుంది. పంట ఎదుగుదలకు, పచ్చగా ఉండేందుకు నత్రజని దోహదపడుతుంది. దీని మూడు భాగాలుగా వేసుకోవాల్సి ఉంటుంది. మొదటి భాగాన్ని దమ్ములో 20 కిలోలు, రెండో భాగాన్ని పిలకలు వేసే దశలో 20 కిలోలు, మూడో భాగాన్ని అంకురం దశలో 20 కిలోలు చొప్పున వేసుకోవాలి.

భాస్వరం: మొక్కల వేర్లు బలంగా ఉండేందుకు దమ్ము సమయంలో భాస్వరాన్ని వాడతారు. లేనిపక్షంలో నాట్లువేసిన వారం రోజుల్లోపు వేయాలి. భాస్వరం అందించే క్రమంలో దమ్ములో మూడు బస్తాల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో గాని లేదా 50 కిలోల డీఏపీనిగాని వేయాలి. ఇలా వేసిన తరుణంలో పొటాష్‌ను దమ్ములో 20 కిలోలు వేస్తే సరిపోతుంది.

కురుపాం నియోజకవర్గంలో సాగు వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాలలో)
గరుగుబిల్లి	14,500
కురుపాం	12,200
గుమ్మలక్ష్మీపురం	8,700
కొమరాడ	12,400
జియ్యమ్మవలస	15,600



దుఖానంలో నిల్వ ఉన్న ఎరువులు

పొటాష్: పొటాష్ వల్ల ఆకులు గరుకుతనం కలిగివుండడమే కాకుండా గింజ గట్టిపడేందుకు దోహదపడుతుంది. వరికి చీడపీడల బెడద తగ్గుతుంది. పొటాష్‌ను దమ్ములో 25 కిలోలు, అంకుర దశలో 20 కిలోలు చొప్పున వేసుకోవాలి.

జింక్: జింకును దమ్ములో ఎకరాకు 40 కిలోలు చొప్పున వేసుకోవాలి. జింక్ లోపంను పంటచేనులో గుర్తిస్తే వందలీటర్ల నీటిలో 10 గ్రాముల జింక్‌సల్ఫేట్ పౌడర్‌ను కలిపి పిచికారీ చేసుకోవాలి.

- నీటి ఎద్దడివున్న పంట ప్రాంతాల్లో వెదజల్లే పద్ధతిలోవరిసాగు ఉత్తమం.

విచక్షణ రహితంగా వినియోగించొద్దు

రైతులు విచక్షణ రహితంగా ఎరువులు, పురుగు మందులను వినియోగించడం వల్ల సాగు ఖర్చు పెరిగిపోవడంతో పాటు భూమి నిస్సారం అవుతుంది. భూసార పరీక్షలు చేయించుకొని వాటి ఫలితాలకు అనుగుణంగా వ్యవసాయశాఖ సిబ్బంది సూచనల మేరకు తగిన మోతాదులో మాత్రమే ఎరువులు వేసుకోవాలి. ఇలా చేయడం వల్ల సాగు ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చు.

– ఆర్.విజయభారతి, వ్యవసాయాధికారి, గరుగుబిల్లి

వెదలో కలుపు నివారణ చర్యలు చేపట్టాలి. అనంతరం నీటి నిల్వలను బట్టి యూరియా, భాస్వరం, పొటాష్ ఎరువులను వ్యవసాయ సిబ్బంది సిఫార్సు మేరకు వినియోగించుకోవాలి.

క్లుప్తంగా

బౌద్ధ, కల్కి అవతారాల్లో జగన్నాథుడు



పూజలు అందుకుంటున్న స్వామివారు

బలిజిపేట: జగన్నాథస్వామి ఉత్సవాలలో భాగంగా ఎనిమిదవ రోజు ఆదివారం స్వామివారిని బౌద్ధ, కల్కి అవతారాల్లో అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకుడు హరి ఆధ్వర్యంలో అర్చకులు ఆర్.పార్థసారథి ఆచార్యులు, పి.రవికుమార్, సురేష్‌లు గుండిచా మందిరం వద్ద స్వామివారికి అవతారాలను మార్పుచేసి పూజాకార్యక్రమాలు చేశారు. ధూపదీప నైవేద్యాలతో స్వామివారికి పూజలు చేసిన అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

19న ఎంపీ రాక

సాలూరు: ఎన్నికల్లో గెలిచిన తర్వాత తొలిసారిగా అరుకు ఎంపీ గుమ్మ తనూజరాణి ఈ నెల 19న సాలూరు రానున్నారని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర తెలిపారు. ఆదివారం పట్టణంలోని తన స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 19న ఉదయం 10 గంటలకు పట్టణంలోని పార్టీ కార్యాలయానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి ఆమె చేరుకుంటారన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారని చెప్పారు. అనంతరం పాచిపెంట మండలంలో పదిన్నర గంటలకు జరగనున్న మండల సర్వసభ్య సమావేశంలో.. మధ్యాహ్నం సాలూరులో జరిగే మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

సూర్యపీఠంలో సౌర హోమం



సూర్యపీఠంలో హోమం నిర్వహించిన శ్రీ వేమకోటి నరహరి శాస్త్రి

పార్వతీపురంటౌన్: పట్టణంలోని సూర్యపీఠంలో సకల కార్యసిద్ధి రామాయణ మంత్ర హోమం, ఆదిత్య పంచాయతన క్షీరాభిషేకం, సౌరహోమం ఆదివారం నిర్వహించారు. నవగ్రహ హోమాలను బ్రహ్మశ్రీ శ్రీ వేమకోటి నరహరి శాస్త్రి జరిపించారు. సౌరయాగశాలలో సకల దేవతా ఉత్సవ మూర్తులకు ధ్యానపూర్వక పుష్పాంజలి సమర్పించారు. కార్యక్రమంలో వేమకోటి వివేకానంద్ తదితరులు వైదిక సహకారం అందించారు.

ఆస్పత్రి నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి

సీతంపేట: సీతంపేటలో నిర్మాణంలో ఉన్న సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎ.భాస్కరరావు డిమాండ్ చేశారు. ఏరియా ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో మందులు లేక రోగులు బయట కొనుగోలు చేస్తున్నారన్నారు. మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు వ్యాపిస్తున్నా పట్టించుకునేవారు లేరన్నారు. సీతంపేటలో జనరిక్ మందుల షాపును అందుబాటులోకి తీసుకురావాలని, ప్రైవేటు మెడికల్ షాపుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు.

శాకాంబరీగా గాయత్రీమాత



శాకాంబరీ అలంకరణలో అమ్మవారు

పాలకొండ: పట్టణంలోని గాయత్రీ మాత ఆలయంలో వారాహిగుప్త నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. తొమ్మిదవ రోజు ఆదివారం గాయత్రీమాత శాకాంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి చిట్టిబాబు శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

తప్పిన పెను ప్రమాదం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి ఏపీజీవీబీ కాలనీలో చింత విమలారాణికి చెందిన శ్లాబు ఇల్లు పైకప్పు కూలిపోయింది. పక్కనే ఉన్న టి.పకీరునాయుడుకు చెందిన రేకుల ఇంటిపై పడటంతో ఇల్లు ధ్వంసం అయింది. రేకుల శబ్దానికి ఇంట్లోని వారంతా భయంతో పరుగులు తీయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటనపై రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినట్లు సర్పంచ్ గౌరీశంకరరావు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.